క్లుప్తంగా

వందశాతం పన్నులు వసూలు చేయాలి



బిచ్కుంద(జుక్కల్): ఈనెలాఖరు నాటికి వంద శాతం పన్నులు వసూలు చేయాలని బాన్సువాడ డీఎల్పీవో సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీని బుధవారం ఆయన సందర్శించి, రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రతిరోజు సిబ్బంది తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకొని వెంటనే పరిష్కరించాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. ఎంపీవో కృష్ణ, కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీయాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయాలని ప్రిన్సిపాల్ రాజిరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో బుధవారం 'పీఎంశ్రీ'లో భాగంగా 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హర్యానాకు సంబంధించిన భాష, సంస్కృతిని విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. అంతేకాకుండా హర్యాన రాష్ట్ర ప్రజలు అవలంబిస్తోన్న వంటకాలను విద్యార్థులతో చేయించినట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ప్రోగ్రాం ఇన్‌చార్జి రమేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చూడాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని 42 గ్రామ పంచాయతీల్లో వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీడీవో నరేష్ సూచించారు. లింగంపేట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిషన్ భగీరథ నీళ్లు రాని రోజు ఆయా గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అలాగే ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. ఉపాధి సిబ్బంది, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం



నస్రుల్లాబాద్: మండల కేంద్రంలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. అసెంబ్లీ బడ్జెట్‌పై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు జుబేర్, నరసింహులుగౌడ్, అఫ్రోజ్, సాయిలు, వెంకట్, శంకర్, సాయికుమార్, మోసిన్, షఫీ, దారపోశెట్టి, రాథోడ్ రాజు, శేఖర్, పోచయ్య, గణేష్, శివ, రమేష్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్ పరీక్షల్లో ప్రతిభ



కామారెడ్డి రూరల్: శ్రీనివాస రామానుజన్ గణిత ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన గణిత ఒలింపియాడ్ పరీక్షల్లో మండలంలోని చిన్నమల్లారెడ్డి విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈసందర్భంగా హైదరాబాద్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో విద్యార్థులు ప్రతిభా పురస్కారాలు అందుకున్నారు. సంస్థ అధ్యక్షుడు తుమ్మ అమరేష్, హెచ్ఎం సాయిరెడ్డి, విద్యార్థులు నిహారిక, నిఖిల, సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలి

కామారెడ్డి అర్బన్: విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు, ఆధ్యాత్మిక భావన కూడా ముఖ్యమనే విషయం గుర్తించాలని శ్రీరామ జప లిఖిత ప్రచారకులు కృష్ణానందస్వామి అన్నారు. పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో బుధవారం నిర్వహించిన అథ్లెటిక్స్ ఎంపిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ బావులు.. ప్రమాదాలకు నిలయాలు

- రోడ్డు పక్కనే ఉన్నా రెయిలింగ్ నిర్మించని అధికారులు
- భయాందోళనలో ప్రయాణికులు



మాచారెడ్డి మండలంలో రోడ్డు పక్కన పిచ్చిమొక్కల మధ్య ఉన్న బావి

మాచారెడ్డి: రోడ్డు పక్కనే ఉన్న బావులు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ బావుల వద్ద సైడ్ వాల్స్ నిర్మించకపోవడంతో వాహనదారుల ఆదమరిచి ప్రయాణిస్తే అంతే సంగతులని పలువురు పేర్కొంటున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

బావుల చుట్టూ పిచ్చిమొక్కలు..

మండలంలోని మైసమ్మ చెరువు తండా సోమారంపేట గ్రామాల మధ్య రహదారి పక్కన ఉన్న వ్యవసాయ బావులు ప్రమాదకరంగా మారాయి. బావుల చుట్టూ గడ్డి, పిచ్చి మొక్కలు పెరగడం వల్ల అవి కనిపించకుండా ఉంటున్నాయి. ఎవరైనా కొత్తవాళ్లు వెళితే వాటిని గమనించక ఆ బావుల్లో పడిపోయే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఓ ద్విచక్ర వాహనదారుడు బావిలో పడిపోగా, వెంటనే స్థానికులు రక్షించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. రోడ్డు పక్కన బావులు ఉన్న సమయంలో భారీ వాహనాలు ఎదురెదురుగా ప్రయాణించినపుడు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. వర్షాకాలంలో వర్షం నీటితో బావులు నిండిపోవడంతో వాటిని ప్రయాణికులు గుర్తించలేకపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఉన్న బావుల వద్ద రెయిలింగ్ ఏర్పాటు చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందిగా ఉంది..



రోడ్డు పక్కనున్న బావులతో చాలా ఇబ్బందిగా ఉంది. వెంటనే అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి. ఎదురెదురుగా రెండు భారీ వాహనాలు వస్తే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

– బుక్యా నర్సింలు, సోమారంపేట

రెయిలింగ్ ఏర్పాటు చేయాలి



ప్రమాదకరంగా మారిన బావుల వద్ద రెయిలింగ్ ఏర్పాటు చేయాలి. ఆ బావుల్లో వన్య ప్రాణులు సైతం పడిపోయి ప్రాణాలు కోల్పోతున్నాయి. సంబంధిత అధికారులు సమస్యపై వెంటనే స్పందించాలి.

– సంతోష్, మాజీ సర్పంచ్, మైసమ్మ చెరువు తండా

బాధ్యతల స్వీకరణ

రాజంపేట తహసీల్దార్‌గా సతీష్‌రెడ్డి



రాజంపేట: రాజంపేట మండల తహసీల్దార్‌గా సతీష్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఉన్న తహసీల్దార్ అనిల్ కుమార్ డొంగ్లీ మండలానికి బదిలీ అయ్యారు. గాంధారి తహసీల్దార్ సతీష్‌రెడ్డి బదిలీపై రాజంపేటకు వచ్చారు. ఈసందర్భంగా సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నాయబ్ తహసీల్దార్ బదిలీ

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట నాయబ్ తహసీల్దార్ సంగమేశ్వర్ బదిలీపై బాన్సువాడ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తున్నట్లు రెవెన్యూ సిబ్బంది బుధవారం తెలిపారు. ఆయన స్థానంలో ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న రాందాస్ లింగంపేటకు బదిలీపై వస్తున్నట్లు తెలిపారు.

పిట్లం తహసీల్దార్‌గా నరేందర్‌గౌడ్



పిట్లం(జుక్కల్): పిట్లం మండల తహసీల్దార్‌గా రాజ నరేందర్‌గౌడ్‌ను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. రాజ నరేందర్‌గౌడ్ ఇంతకు ముందు లింగంపేట్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించగా, బదిలీపై ఇక్కడకు రానున్నారు. ఇక్కడ విధులు నిర్వహించిన వేణుగోపాల్ బిచ్కుందకు బదిలీ అయ్యారు.

గాంధారి తహసీల్దార్‌గా రేణుకా చౌహాన్



గాంధారి(ఎల్లారెడ్డి): గాంధారి మండల తహసీల్దార్‌గా రేణుకా చౌహాన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గాంధారిలో విధులు నిర్వహించిన సతీష్‌రెడ్డి రాజంపేట మండలానికి బదిలీపై వెళ్లారు. డోంగ్లీ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన రేణుకా చౌహాన్ గాంధారికి బదిలీపై వచ్చారు.

మాల్తుమ్మెదలో మద్యం విక్రయించొద్దంటూ నోటీసులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మాల్తుమ్మెద గ్రామంలో మద్యం విక్రయాలను వెంటనే నిలిపివేయాలని సూచిస్తూ పంచాయతీ కార్యదర్శి అశోక్ బుధవారం గ్రామంలోని పలు దుకాణాలకు నోటీసులను అందజేశారు. గ్రామంలో మద్యం విక్రయాల వల్ల యువత చెడుదోవ పట్టడంతోపాటు చిల్లర దొంగతనాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఇచ్చిన వినతి మేరకు మద్యం విక్రయదారులకు నోటీలను అందజేశారు. ప్రస్తుతం ఉన్న మద్యం నిల్వలను మూడురోజుల్లో విక్రయించుకోవాలని, మూడురోజుల తర్వాత ఏ ఒక్కరు మద్యం విక్రయించినా జరిమానా విధించడంతోపాటు చర్యలు తీసుకుంటామని అన్నారు.



వ్యాపారికి నోటీసును అందజేస్తున్న అధికారులు

ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాలి



ఎల్లారెడ్డిరూరల్: ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించాలని ఎంపీవో ప్రకాష్ అన్నారు. మండలంలోని అన్నాసాగర్ గ్రామంలో బుధవారం శానిటేషన్ పనులను ఆయన పరిశీలించారు. గ్రామంలో మురికి కాలువలు శుభ్రం చేయించాలని, నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని గండిమాసానిపేట ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. హెచ్ఎం రేణుక, వెంకటయ్య, విద్యార్థులు మీనాక్షి, జయరాజ్ ఉన్నారు.

ఆధ్యాత్మికం

ముగిసిన సిద్దరామేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



భిక్కనూరు: మండలకేంద్రంలోని సిద్దరామేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఐదు రోజులపాటు కొనసాగిన ఉత్సవాల్లో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. నాకబలి, క్షేత్రపాలక బలి, పూర్ణాహుతి కార్యక్రమాలను వేదపండితులు రామగిరిశర్మ, రాజేశ్వరశర్మలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో శ్రీధర్, అలయ పునర్‌నిర్మాణకమిటీ చైర్మన్ అందే మహేందర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ లింబాద్రి పాల్గొన్నారు.

సరస్వతి ఆలయంలో విద్యార్థుల పూజలు



కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఇల్చిపూర్ గ్రామ శివారులోని సరస్వతిదేవి ఆలయంలో బుధవారం వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు. సదాశివనగర్ మండలం కుప్రియాల్ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు, తాడ్వాయి మండలం రవీంద్రభారతి పాఠశాలకు చెందిన 9, 10వ తరగతి విద్యార్థులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు అర్చన చేసి, విద్యార్థులకు తీర్థప్రసాదాలు ఇచ్చి, ఆశీర్వదించారు.

ఘనంగా సేవాలాల్ ఆలయ వార్షికోత్సవాలు



గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని వెంకటాపూర్ తండాలో నిర్మించిన భవాని, సేవాలాల్ మహారాజ్ ఆలయ 21వ వార్షికోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పొరాదేవి ఆలయ పీఠాధిపతి బాబుసింగ్ మహారాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పీఠాధిపతి బాబుసింగ్ మహారాజ్‌ను కలిసి ఆశీర్వాదాలు పొందారు.

సమాచారం..

రేపు తైబజార్ వేలం

దోమకొండ: మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో ఈనెల 21న తైబజార్ వేలంపాట నిర్వహించనున్నట్లు దోమకొండ జీపీ కార్యదర్శి యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు రోజువారి మార్కెట్‌కు సంబంధించి వేలం ఉంటుందని, ఆసక్తిగల వారు పాల్గొనాలని కోరారు. గ్రామ ప్రజల సమక్షంలో వేలం ఉంటుందన్నారు.

నేడు గిరిజన చారిత్రక కథనాలపై వర్క్‌షాప్

కామారెడ్డి అర్బన్: పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గురువారం డిపార్టుమెంట్ ఆఫ్ హిస్టరీ ఆధ్వర్యంలో 'హిస్టారికల్ నేరేటివ్స్ అండ్ ట్రైబల్ ఐడెంటిటీ–ఏ ఫోకస్ ఆన్ అన్సంగ్ హీరోస్' (చారిత్రక కథనాలు–గిరిజనుల గుర్తింపు, తెలియని కథానాయకులపై దృష్టి) అనే అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ తెలిపారు. వర్క్‌షాప్‌కు సంబంధించి సమగ్ర సమాచారం పోస్టర్‌ను బుధవారం ఆయన కళాశాలలో ఆవిష్కరించారు. వర్క్‌షాప్‌లో చరిత్ర విశ్లేషకులు టి శ్రీనివాస్, అంకం జయప్రకాష్ పాల్గొంటారన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

బిచ్కుంద(జుక్కల్): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21న బిచ్కుంద సబ్ స్టేషన్‌లో 'విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించనున్నట్లు డీఈ గంగాధర్ తెలిపారు. బిచ్కుంద, మద్నూర్, డోంగ్లీ, జుక్కల్ మండలాల విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను ఈ వేదికలో విన్నవించుకోవాలని ఆయన సూచించారు. అధికారులు అందుబాటులో ఉంటారని, వినతులు స్వీకరించి వెంటనే పరిష్కరించనున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొలతల ప్రకారం పనులు చేపట్టాలి





జుక్కల్‌లో ఉపాధి పనులను పరిశీలిస్తున్న అధికారులు.. భవానీపేట గ్రామంలో..

నిజాంసాగర్(జుక్కల్): ఉపాధిహామీ కూలీలు కొలతల ప్రకారంగా పనులు చేపడితే, కూలీ గిట్టుబాటు అవుతుందని జుక్కల్ ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. జుక్కల్ మండల కేంద్రంలో ఉపాధిహామీ పనులను బుధవారం ఎంపీడీవో పరిశీలించారు. పనుల వద్ద కూలీలకు తాగు నీరు, నీడ సదుపాయం కల్పించాలని ఈజీఎస్ సిబ్బందికి ఆయన సూచించారు.

లింగంపేట మండలంలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని భవానిపేట గ్రామ శివారులో చేపడుతున్న ఉపాధిహామీ కూలీలకు బుధవారం ఎంపీడీవో నరేష్ ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అలాగే రాంపూర్, జల్దిపల్లి, కొడాపూర్, భవానిపేట, ముంబోజిపేట, గ్రామాల్లో ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కొలతల ప్రకారం పనులు చేయాలని కూలీకు సూచించారు. అలాగే ఆయా గ్రామాల్లో నర్సరీలను పరిశీలించారు. ఈసీ రాజు, క్షేత్రసహాయకులు, కార్యదర్శులు ఉన్నారు.

కాంగ్రెస్, ఎమ్మార్పీఎస్ శ్రేణుల సంబురాలు



నిజాంసాగర్‌లో సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు



మహమ్మద్ నగర్‌లో..



బిచ్కుందలో..



గాంధారిలో..

సాక్షి నెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా బుధవారం కాంగ్రెస్, ఎమ్మార్పీఎస్ శ్రేణులు వేర్వేరుగా సంబురాలు నిర్వహించారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ అమలుకు, బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుకు ఆమోదం తెలపడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా జిల్లాకేంద్రంతోపాటు అన్ని మండలాలు, గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేల చిత్రపటాలకు క్షీరాభిషేకాలు నిర్వహించారు. అలాగే టపాసులు కాలుస్తూ, స్వీట్లు పంచిపెట్టారు. అలాగే ఎస్సీ వర్గీకరణ కోసం కృషి చేసిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి సంఘ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు.



వడ్లం గ్రామంలో మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు



కామారెడ్డిలో..



మాచారెడ్డిలో



ఎల్లారెడ్డిలో..



సదాశివనగర్‌లో..



భిక్కనూరులో..

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను రెవెన్యూ అధికారులు పంపిణీ చేశారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, శేకావత్, విద్యాసాగర్ ఉన్నారు.

నష్టపరిహారం అందజేత



కామారెడ్డి అర్బన్: తాడ్వాయి మండలం చందాపూర్‌కు చెందిన అల్లూరి నర్సారెడ్డి గతంలో విద్యుత్ ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి బుధవారం హనుమకొండలో నిర్వహించిన ఈఆర్సీ సమావేశంలో సీఎండీ వరుణ్‌రెడ్డి రూ.5లక్షల నష్టపరిహారం అందజేశారు. బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు పైడి వెంకట్‌రెడ్డి, జిల్లా ఎస్ఈ శ్రావణ్‌కుమార్, బీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

బాన్సువాడ: పట్టణంలో పలు బాధిత కుటుంబాలకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. నియోజకవర్గానికి చెందిన 15 మంది బాధితులకు రూ.4.73 లక్షల చెక్కులను అందజేసినట్లు ఆయన అన్నారు. అలాగే ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ రైతులకు, సామాన్య ప్రజలకు అనుకూలంగా ఉందన్నారు.

వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై బుధవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించని వాహనదారులకు జరిమానా విధించారు. అలాగే పెండింగ్ చలాన్లను చెల్లించేలా చర్యలు తీసుకున్నారు. ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీపీకి సన్మానం

కామారెడ్డి టౌన్: అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలు చేపట్టిన దేవుని సూర్యప్రసాద్‌ను బుధవారం డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనే శ్రీనివాస్, నాయకులు రాజాగౌడ్, లక్ష్మిరాజం, శ్రీనివాస్, కిరణ్, అడ్వకేట్ మక్సూద్ ఉన్నారు.

సీఆర్పీ మహమూద్‌కు సన్మానం

రామారెడ్డి: రామారెడ్డి సీఆర్పీగా విశేష సేవలు అందిస్తున్న మహమూద్‌కు ఇటీవల మదర్ థెరిస్సా సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ వైజాగ్ ఆధ్వర్యంలో గురు బ్రహ్మ అవార్డ్‌ను పోస్ట్ ద్వారా పంపించారు. ఆ అవార్డును రామారెడ్డి కాంప్లెక్స్ హెచ్ఎం ఆనంద్ బుధవారం మహముద్‌కు అందజేసి సన్మానించారు.

మూత్రశాలల నిర్మాణానికి భూమిపూజ

మాచారెడ్డి: పాల్వంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ నిధులు రూ.10 లక్షలతో మూత్రశాలల నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు రాజనర్సింహారెడ్డి, డీఈవో రాజు, హెచ్ఎం గోవర్ధన్‌రెడ్డి, రోటరీ క్లబ్ ముఖ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

ఉద్యోగులకు పదవీ విరమణ సహజం

దోమకొండ: ఉద్యోగులకు పదవీ విరమణ సహజమని మాజీ జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, భిక్కనూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుంచాల శేఖర్ అన్నారు. దోమకొండకు చెందిన ఉపాధ్యాయుడు కొండ్ల తిరుపతి పదవీ విరమణ సందర్భంగా బుధవారం వారు ఆయనను సన్మానించారు. మాజీ సర్పంచ్ నల్లపు అంజలి, మాజీ ఎంపీటీసీ నల్లపు శ్రీనివాస్, మార్కెట్ కమిటి డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బీబీపేట: మండలంలోని మల్కాపూర్ గ్రామంలో బీజేపీ నాయకులు బుధవారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ. 10 లక్షల నిధులతో పనులు చేపడుతున్నట్లు వారు తెలిపారు. బీజేపీ మండలాధ్యక్షుడు అల్లం ప్రవీణ్, నాయకులు కుంట లక్ష్మారెడ్డి, నరేందర్‌రెడ్డి, రంజిత్‌గౌడ్, రవీందర్, పోసు శివ, సంతోష్‌గౌడ్, స్వామి పాల్గొన్నారు.

భిక్కనూరులో కంటివైద్య శిబిరం

భిక్కనూరు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో బుధవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా కంటి వైద్యుడు రవీందర్‌పటేల్ పలువురికి కంటి పరీక్షలను నిర్వహించి, అవసరమైన వారికి కంటి అద్దాలను మందులను పంపిణీ చేశారు.